క్లుప్తంగా

ఎంపీపీకి అగ్నిమాపక సిబ్బంది కృతజ్ఞతలు



ఎంపీపీ రామధర్మజను సన్మానిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించిన ఎంపీపీ వేమవరపు రామధర్మజకు అగ్నిమాపక సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కేంద్రం వద్ద సీసీరోడ్డు నిర్మాణంతో పాటు పక్కన్న ఖాళీ స్థలాన్ని ఎత్తు చేసి మొక్కలు వేశారు. కేంద్రానికి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రావికమతం: గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం కొత్తకోటలో డ్వాక్రా సంఘాల సభ్యులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పండ్ల తోటల అభివృద్ధికి, తద్వారా డ్వాక్రా సభ్యులకు ఆదాయం పెంచేందుకు మామిడి, సపోటా, స్వీట్ ఆరెంజ్, జామ, నిమ్మ, కొబ్బరి తదితర రకాల మొక్కలను కడియం నుంచి తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నట్టు సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ తెలిపారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీ గుమ్మడు వీధిలో కాలువలపై ఆక్రమణలను మంగళవారం తొలగించారు. విశాలంగా ఉండే వీధిలో రోడ్డుకిరువైపులా కాలువలను ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో కాలువలు పూడికపోయి వర్షపు నీరు రహదారిపై పారుతుండేది. వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామ నాయకుడు శీలం శంకర్రావు ఈ విషయాన్ని పంచాయతీ పాలకుల దృష్టికి తేవడంతో సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, ఎంపీటీసీ కుంచా లక్ష్మి, పాలకవర్గ సభ్యులు రమేష్, దొరబాబు పొక్లెయిన్ సహాయతో మంగళవారం ఆక్రమణలను తొలగించారు.

21న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

చోడవరం: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈ నెల 21న చోడవరం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ వీడీవీ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో చోడవరం సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలతోపాటు నిర్వహణపై తగు సూచనలు అందించాలని ఆయన కోరారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



వీర ప్రకాష్



రాజశేఖర్

రావికమతం: పీఆర్టీయూ మండల శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక మంగళవారం రావికమతంలో నిర్వహించారు. సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాప తిరుపతిరావు సమక్షంలో మండల శాఖ నూతన అధ్యక్షుడిగా అంగజాల వీరప్రకాష్, కార్యదర్శిగా వేములపూడి రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. జీపీఎస్ నాయుడు ఎన్నికలాధికారిగా వ్యవహరించారు.

బూత్ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం

- ఆ దిశగా కృషి చేయాలి
- వైఎస్సార్‌సీపీ కేడర్‌కు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపు ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ పరిధిలోని ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు ప్రతినిధులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రధానంగా ప్రముఖ దేవాలయాలు, స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడం, లక్ష్మీపురం, చీడికాడ, ఖండిపల్లి రోడ్ల అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో పీజీ కాలేజీ మంజూరు చేశామని, జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలకు, ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీకి సొంత భవనాలు నిర్మించామన్నారు. ప్రతి ఇంటికీ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు మరింత కూడగట్టాలని పిలుపు ఇచ్చారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికలు కార్యకర్తలంతా సిద్ధం కావాలని కోరారు. సీనియర్ నాయకులు డాక్టర బండారు సత్యనారాయణ, వెంపలి ఆనందీశ్వరరావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థకు కేరళ బృందం కితాబు

రోలుగుంట: స్థానిక పాత రామమందిరం వద్ద కల్యాణ మండపం ఆవరణలో మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ముందుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో విజయవంతం అయినందుకు భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా ఉందన్నారు. ఈ విధానంపై కేరళ బృందం విశ్లేషణ చేసి కితాబు పలికిందన్నారు. కరోనాను అరికట్టడంలో వలంటీర్ల సమాచారం, వారి సేవలు మరువలేనివన్నారు. కె.నాయుడు పాలెం నుంచి -బుచ్చింపేట రోడ్డు కలిపేందుకు, రోలుగుంట వయా కొమరవోలు కుసుర్లపూడి వరకు తదితర రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. గడప గడపకు కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక ఫలితాల సాధన కోసం పని చేయాలన్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, వలంటీర్ల మండల స్థాయి కన్వీనర్ గొర్లె వెంకటరామన్, పార్టీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీశ్రీనివాస్, గొర్లె చెల్లంనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మద్దు తాతబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ 9వ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షం పడుతున్నా.. గొడుగుల నీడలో ఎమ్మెల్యే ఇక్కడ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు పక్కా గృహాలు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకాశివ, వార్డు ఇన్‌చార్జి ఎల్లేటి శ్రీనువాసరావు, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ ఉన్నీషాబేగం, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



సర్వే నిర్వహిస్తున్న సిగ్మా రీసెర్స్ సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: ప్రజల ఆరోగ్యం, వ్యాధులు, వైద్యానికి చేస్తున్న ఖర్చు, అందుబాటులో వైద్య సేవలు తదితర అంశాలకు సంబంధించి మాడుగులలో ఆరో విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే మంగళవారం నిర్వహించారు. కె.జె.పురం పీహెచ్‌సీ, సిగ్మా రీసెర్స్ సంస్థ ప్రతినిధులు మాడుగులలో 22 ఇళ్లను సర్వే చేశారు. అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయ గణాంకాధికారి ఎ. రామచంద్రరావు ఈ సర్వేకు ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. ప్రశ్నావళి ఆధారంగా ఇంటింటికీ వెళ్లి వారి అభిప్రాయాలును తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామస్తులకు బీపీ, సుగర్, ఎత్తు, బరువు పరీక్షించారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. సిగ్మా పరిశోధన సంస్థకు చెందిన ఏడుగురు సభ్యులతోపాటు కె.జె.పురం పీహెచ్‌సీ డాక్టర్ లకే శివప్రసాదుపాత్రుడు, కమ్యూనిటీ హెల్త్ అధికారి సి.హెచ్. పుష్పమ్మ, ఎంపీహెచ్‌ఈవో పి. రామారావు, ఆరోగ్య సహాయకుడు వెంకటరావు, హెచ్‌వీ హేమమాలిని, ఏఎన్‌ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ భవానీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాసిడ్ పక్కదారి పట్టకుండా చూడాలి

ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



మాట్లాడుతున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం: కళాశాలలు, ల్యాబ్‌ల నుంచి యాసిడ్ పక్కదారి పట్టకుండా సరైన జాగ్రత్తలు పాటించాలని ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో కాలేజీలు, ల్యాబ్ అసిస్టెంట్లు, మెడికల్ షాపులు, గోల్డ్ యూనియన్, పురుగుల మందుల షాపుల యజమానులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకలాపాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులకు వచ్చినట్లయితే డాక్టర్‌కు చూపించుకోవాలని చెప్పాలన్నారు. షాపునకు వచ్చిన వారి ప్రవర్తనను గమనించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

సచివాలయాల్లో డీఎల్‌డీవో తనిఖీ



మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ

మాడుగుల రూరల్: జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కారమవుతున్నాయని నర్సీపట్నం డీఎల్‌డీవో ఎం. ఉదయశ్రీ పేర్కొన్నారు. మాడుగులలో గ్రామ సచివాలయాలు-1, 2, 3లను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, అక్కడ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష ద్వారా పరిష్కరించిన అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజు యూనిఫాం విధిగా ధరించాలని సూచించారు. సర్పంచ్ యడ్ల కళావతి, పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు, పాల్గొన్నారు.

ప్రకృతి సాగు లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న కృష్ణారావు

మాకవరపాలెం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి సాగు విభాగం స్టేట్ కోఆర్డినేటర్ కృష్ణారావు సూచించారు. మంగళవారం జంగాలపల్లిలో ప్రకృతి సాగు చేసే రైతులతో ఆయన మాట్లాడారు. ఈ విధానంలో సాగు చేసే వారికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను తెలియజేశారు. అంతే కాకుండా అధిక దిగుబడుల తోపాటు ఆరోగ్య వంతమైన పంట పొందొచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని అవగాహన కల్పించారు. నవరత్నసాగు-నేలతల్లి బాగు కార్యక్రమంలో 30 రకాల విత్తనాలతో ఎరువుగా వినియోగించేందుకు వేసిన మొక్కలను పరిశీలించారు. ప్రకృతి సాగు సిబ్బంది శ్యామల, సుదర్శన్, కవిత, రైతులు సూరిబాబు, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

బుచ్చెయ్యపేట: చిన అప్పనపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు మామిడితోటలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు తదితర ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల పార్టీ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, కోఆపరేటివ్ అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొనాలని కోరారు.

వర్షంతో రైతులకు ఊరట



కె.జె.పురం చెరువులో చేరిన వర్షపు నీరు

గొలుగొండ/దేవరాపల్లి/మాడుగుల రూరల్: పలు మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో రైతులకు ఊరట కలిగింది. ఈ వర్షంతో గొలుగొండ మండలంలో దారగెడ్డ, బోరింగ్‌గెడ్డ నుంచి కొద్దిపాటి వర్షం నీరు ప్రవహించింది. దేవరాపల్లిలో సాయంత్రం వరకు చిరుజల్లులు మాదిరిగా సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షం వరి నారుమడులకు మేలు చేకూర్చిందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాడుగులలో ఇటీవల ఉపాధి పనులు చేపట్టిన చెరువుల్లో వర్షపు నీరు చేరింది. దీంతోపాటు చెరకు కార్షి తోటలకు ఊపిరి పోసిందని రైతులు చెబుతున్నారు.

బీఎస్సీ బయాలజీ కొనసాగింపుపై మంత్రికి వినతి



విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: విద్యార్థుల ప్రయోజనార్థం సింగల్ మేజర్ సబ్జెక్టు ప్రోగ్రాంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయాలజీ సబ్జెక్టును కొనసాగించాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. మంగళవారం విజయవాడలో మంత్రిని కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువ మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ బైపీసీ చదివి, బీఎస్సీ బయాలజీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. ఈ మేరకు తమ కళాశాలలో అవకాశం కల్పించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

వర్షాకాలంలో పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి



కె.కోటపాడు: వర్షాకాలంలో పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాల సమయాల్లో పాకల వద్ద బురద ఉన్నచోట పశువులను ఉంచొద్దని సూచించారు. పరిశుభ్రతతోపాటు నీటి నిల్వలు లేని ప్రాంతాల్లో పశువులను ఉంచాలన్నారు. పెయ్యిలకు సకాలంలో నట్టల నివారణ మందులను అందించడం వల్ల నులిపురుగుల సమస్య బారిన పడకుండా ఉంటాయన్నారు. వాటి ఎదుగుదల బాగుంటుందన్నారు. గొర్రె, మేకల్లో పారుడు వ్యాధి వచ్చే అవకాశముందన్నారు. లేత పచ్చ గడ్డిని మేతగా తినడం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి రాకుండా పెంపకం దారులు ముందస్తుగా రైతు భరోసా కేంద్రాల్లోని పశువైద్య సహాయకులను సంప్రదించి ఈ.టి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. అదేవిధంగా రాయితీపై అందించేందుకు గడ్డి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. పశువైద్య సిబ్బంది ఇచ్చే సూచనలను పాడి రైతులు పెంపకంలో తప్పనిసరిగా పాటించాలని కోరారు.

జగనన్న సురక్షతో ప్రజలకెంతో మేలు



మాకవరపాలెం: తూటిపాలలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు



బుచ్చెయ్యపేట: కందిపూడిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న తహసీల్దార్, జెడ్పీటీసీ



బుచ్చెయ్యపేట: పెదమదీనలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీవో, నాయకులు



రోలుగుంట: ఎం.కె.పట్నంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ వరహాలు

బుచ్చెయ్యపేట: జగనన్న సురక్ష వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. మంగళవారం పెదమదీన, కందిపూడి గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించి, 1,393 మంది లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పెదమదీనలో 785 మందికి, కందిపూడిలో 608 మందికి సర్టిఫికెట్లను తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు అందించారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు కొల్లిమల్ల ధనలక్ష్మి వెంకటరావు, కొప్పాక సత్యవతి, గోపిశెట్టి బుజ్జి, సీతా బుజ్జి, ఎల్లపు విజయ్‌కుమార్, ఎంపీటీసీ సీతా వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు గణేష్, కోవెల ఈశ్వరరావు, సన్యాసినాయుడు సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 10,080 వేల ధ్రువపత్రాల పంపిణీ

మాకవరపాలెం: జగనన్న సురక్ష శిబిరాల్లో 10,080 ధ్రువపత్రాలను పంపిణీ చేశామని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మండలంలోని చివరిగా తూటిపాలలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ 15 సచివాలయాల పరిధిలో 10,520 వరకు దరఖాస్తులు రాగా, వాటిలో 10,080 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, సర్పంచ్‌ల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు గోవిందరావు, పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, రుత్తల రాజు, ఎంపీటీసీ రుత్తల సత్యవతి, సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు, మాజీ ఎంపీటీసీ వొబ్బలరెడ్డి రమణ పాల్గొన్నారు.

రోలుగుంట: ఎం.కె.పట్నంలో తహసీల్దార్ కె.వరహాలు, కె.నాయుడుపాలెంలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు బృందాలతో జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. రెండు గ్రామాల సర్పంచ్‌లు ఎస్. సతీష్, గుములూరి బాబులతో కలసి అధికారులు అర్జీదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రవికిరణ్, ఆర్‌ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

రోగులకు సత్వర వైద్య సేవలందించండి



అత్యవసర విభాగంలో వైద్యురాలితో మాట్లాడుతున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: వర్షా కాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి సూచించారు. సోమవారం రాత్రి ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రోగులు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారని, వారికి సత్వర సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అత్యవసర విభాగంలో రాత్రి సమయంలో ఇద్దరు వైద్యుల పర్యవేక్షణ ఉంటుందని ఆస్పత్రి వర్గాలు ఆయనకు తెలిపాయి. వర్షాలు పడుతున్న కారణంగా ప్రజలు వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోగితోపాటు మరో వ్యక్తిమాత్రమే ఆస్పత్రికి రావాలని సూచించారు. వైద్యుడు గోపీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ -60 శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో సూపర్ -60 శిక్షణకు 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ సమన్వయకర్తలు కె. జానీ, ఆర్. రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి మూడేళ్లపాటు కెరీర్ గైడెన్స్, అన్ని పోటీ పరీక్షలకు తయారయ్యే విధంగా ఫౌండేషన్ కోర్సుతో కూడిన విద్య అందిస్తామన్నారు. ఏటా 60 రోజులపాటు భోజన వసతులతో శిక్షణ, వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఆన్‌లైన్ బోధన చేస్తామన్నారు. 6300405712 నంబరును సంప్రదించాలన్నారు.

విజేతలకు అభినందన

పరవాడ: శ్రీకాకుళంలో రాష్ట్ర వుషు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన వుషు (చైనీస్ మార్షల్ ఆర్ట్స్) సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. సబ్ జూనియర్ విభాగంలో యువరాజ్‌సింగ్ 48 కిలోల విభాగంలో వెండి, నిత్య శ్రీ 52 కిలోల విభాగంలో కాంస్య, జూనియర్ విభాగంలో షాగూన్ పాత్రో48 కిలోల విభాగంలో బంగారు, హిమనిషి పార్మర్ 45 కిలోల విభాగంలో బంగారు, అర్పిత పాత్రో 52 కిలోల విభాగంలో వెండి, సాత్విక్ సిద్ధార్థ 52 కిలోల విభాగంలో కాంస్య పతకాలు సాధించారని పాఠశాల పీడీ జి.మధుబాబు చెప్పారు.

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల సమ్మె నోటీస్

దేవరాపల్లి: మండల (గ్రామ రెవెన్యూ సహాయకులు) వీఆర్‌ఏలు మంగళవారం తహసీల్దార్ ఎం. లక్ష్మికి సమ్మె నోటీస్ అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను వీఆర్‌ఏ సంఘ నాయకులు కలిసి తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20, 21న తహసీల్దార్ కార్యాలయం వద్ద, ఆగస్టు 6, 7 తేదీల్లో కలెక్టరేట్ వద్ద, 23, 24 తేదీల్లో విజయవాడలో నిరసనలు చేపట్టి, 25న చలో విజయవాడ చేపడతామన్నారు. సంఘ నాయకులు ఎం. బొజ్జులు, ఐ. ఈశ్వరరావు, బి. సంతోష్ పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

కె.కోటపాడు: మండలంలో ఆర్.వై.అగ్రహారం, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో 11 రకాల ధ్రువపత్రాలను జారీ చేస్తామన్నారు.

నాతవరం: మండలంలో రెండు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. సరుగుడు సచివాలయం వద్ద తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, మన్యపురట్లలో తన ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.